క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు పరిశీలించిన కమిషనర్



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని పారిశుద్ధ్య పనులను సోమవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా పరిశీలించారు. మంగళగిరి నగరంలోని క్లాప్ ఆటోల ద్వారా వచ్చే చెత్త, డోర్ టు డోర్ కలెక్షన్ ఎలా ఉందని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని, డ్రైన్లలో చెత్త వేయవద్దని ప్రజలకు సూచించారు. అనంతరం తాడేపల్లి రూరల్ కొలనుకొండ వద్ద ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. ప్రతి రోజు చెత్త తరలింపు ప్రక్రియను వాహన డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులో వచ్చే చెత్తను ప్రణాళికాబద్ధంగా జిందాల్ ప్లాంట్‌కు తరలించాలని, డంపింగ్ యార్డు చుట్టూ మొక్కలు నాటాలని, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలోఎంటీఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస రావు, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్మకాండల సత్రం ప్రారంభం

మంగళగిరి టౌన్: తాడేపల్లి సీతానగరంలోని పుష్కర ఘాట్ల వద్ద మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో నిర్మించిన కర్మకాండల సత్రమును సోమవారం కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, జనసేన పట్టణ అధ్యక్షుడు అంబటి తిరుపతిరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పనిచేయాలి

తాడికొండ సీఐ వాసు



తాడికొండ: తాడికొండ మండలంలో వినాయక చవితి వేడుకలు ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేలా సిబ్బంది సామరస్యంతో పనిచేయాలని తాడికొండ సీఐ కె.వాసు సూచించారు. సోమవారం ఠాణాలో సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేసి వివాదరహిత వేడుకల నిర్వహణకు సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు వివాదాస్పద వ్యక్తులను బైండోవర్ చేయడం జరిగిందని, వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు జోజి, జీత్యానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



మంగళగిరి టౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం లబ్ధిదారులకు టీడీపీ నాయకులు అందజేశారు. మంగళగిరి పట్టణానికి చెందిన వీరాస్వామికి రూ.52,543, సత్యవతికి రూ.23,920, షేక్ గౌసియాకు రూ.20,541, వెంగళ మల్లేశ్వరికి రూ.37,386లు, తిరువీధుల పద్మావతికి రూ.40,112, మొహమ్మద్ ఆసిఫ్ అహ్మద్‌కు రూ.42,500, బూదాటి మల్లేశ్వరికి రూ.87,226, క్రాంతికి రూ.28,437, షేక్ షరీఫున్‌కు రూ.27,341, మంద్రు నిర్మలకు రూ.20,000 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, టీడీపీ నాయకులు పడవల మహేష్, వాసా పద్మ, రంగిశెట్టి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటీఎంసీ) పరిధిలోని యర్రబాలెంలో ద్విచక్ర వాహనం చోరీకి గురయిన ఘటన చోటు చేసుకుంది. బాధితుడు మల్లేష్ తెలిపిన వివరాల మేరకు ఈ నెల 22వ తేదీన తన ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం తెల్లవారి చూసే సరికి కనిపించలేదన్నారు. వెంటనే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు సీసీ కెమెరాలో పుటేజిని పరిశీలించగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనాన్ని నడిపించుకుంటూ వెళుతుండగా తమ ఇంటి వద్ద ఓ యువకుడు ద్విచక్ర వాహనం తీసుకెళ్తున్న యువకులను అడ్డగించగా పెట్రోలు అయిపోయిందని చెప్పి ఉడాయించారని, దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మంగళగిరి టౌన్: ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు అబద్ధాల హామీలు గుప్పించి మోసం చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మంగళగిరి నియోజవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని 9, 10 వార్డుల్లో పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఆర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి సంవత్సరం దాటినా వాటిని అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేస్తుందని అన్నారు. హామీలు నెరవేర్చలేదని అడిగిన వారిపై కక్షపూరిత రాజకీయాలు చేస్తూ కేసులు బనాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరించాలని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీలు, కులమతాలకతీతంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తే నేడు కూటమి ప్రభుత్వం పథకాలకు తిలోదకాలు ఇస్తోందన్నారు. నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో దివ్యాంగులు, వృద్ధులకు ఇంటింటికీ వెళ్లి పెన్షన్‌ను అందజేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనేక మంది పెన్షన్లు రద్దు చేసి వారి పొట్టకొట్టిందని మండిపడ్డారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, పట్టణ ఉపాధ్యక్షుడు జీలగ గాలయ్య, వేల్పుల ఎలీషా, ప్రధాన కార్యదర్శులు షేక్ సర్దార్, చిట్టిమళ్ల స్నేహసంధ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీతో పాటు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అప్రమత్తత అవసరం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

ఫిరంగిపురం: యువకులు హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలని జోనల్ సూపర్‌వైజర్ బి.నాగేశ్వర రావు అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(దిశ) ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సెయింట్ జేవియర్ కళాశాలలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ప్రాజెక్టు విద్యార్థులకు ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌లో భాగంగా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ హెచ్‌ఐవీ అంటు వ్యాధి కాదని, లైంగికంగా వచ్చే వ్యాధి అని చెప్పారు. బాధితులను చిన్న చూపు చూడకుండా ప్రేమతో ఆదరించాలని తెలిపారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, హెచ్‌ఐవీ రకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం హెచ్‌ఐవీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.మేరీ, ప్రిన్సిపాల్స్ బి.జీవన్‌మణిబాబు, సుదర్శన్, క్లస్టర్ లింక్ వర్కర్ కె.కోటేశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ ఆధ్వర్యంలో పోషక ఆహారంపై అవగాహన



పోషకాహారంపై అవగాహన కార్యక్రమంలో కేఎల్‌యూ విద్యార్థులు

మంగళగిరి టౌన్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఈసీఈ, ట్రిపుల్‌ఈ, సీఎస్‌ఈ విభాగాల ఆధ్వర్యంలో పెనుమాక గ్రామంలో పోషక ఆహారంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థులు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబాల ఆహారపు అలవాట్లు, పోషకాహారంపై అవగాహన, గర్భిణులు, బాలింతల ఆహారపు జాగ్రత్తలు వివరిస్తూ సర్వే నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఉపాధ్యాయులు పిల్లలకు ఇచ్చే ఆహారం, గర్భిణులు, బాలింతలకు అందించే ఆహారాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్మార్ట్ విలేజ్ రివల్యూషన్ కో ఆర్డినేటర్లు పి.సత్యనారాయణ, టి.శివకృష్ణలు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సామాజిక అనుభవాన్ని కలిగించడమే కాకుండా, సేకరించిన సమాచారం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ కొత్త విధానాలు రూపొందించేందుకు మార్గనిర్దేశం చేస్తుందని, గ్రామీణ కుటుంబాల జీవనశైలిని మెరుగుపరచడానికి, ప్రజల్లో చైతన్యం కలిగించడానికి దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ ఉపాధ్యాయుడిగా ఎంపికవడం హర్షణీయం

సూర్య ప్రకాష్‌ను అభినిందించిన ఏపీ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుడే రాజారావు



సూర్యప్రకాష్‌ను అభినందిస్తున్న గుడే రాజారావు

తాడికొండ: పేదరికం ప్రతిభకు అడ్డుకాదని నిరూపిస్తూ తాడికొండకు చెందిన కలిసేటి సూర్యప్రకాష్ నిరూపించాడని ఏపీ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుడే రాజారావు అన్నారు. సోమవారం తాడికొండకు చెందిన ఉపాధి కూలీగా పనిచేసి కష్టపడి డీఎస్సీలో ఉద్యోగం సాధించిన సూర్యప్రకాష్‌ను ఆయన అభినందించారు. తండ్రి మరణించినా వృద్ధాప్యంలో ఉన్న తల్లిని పోషించుకుంటూ కష్టపడి చదివి కొలువు సాధించిన సూర్యప్రకాష్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని కొలువుల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ మేరకు సూర్యప్రకాష్‌ను అభినందించి భవిష్యత్తులో పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుడిగా కూడా రాణించాలని సూచించారు. నంబూరు రత్నకిషోర్, మాతంగి సియోను కుమారి, నంబూరు కమల, సునీత, మాణిక్యం, పవిత్ర, బుజ్జా, సుధీర్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

అల్పాదాయ వర్గాలకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి

సీపీఎం నాయకులు



ఎస్‌ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తాడికొండ: రూ.12 వేల లోపు ఆదాయం ఉన్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాయపూడి సీఆర్డీయే సర్కిల్ విద్యుత్ కార్యాలయంలో ఎస్‌ఏవో వై.అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీలకు రూ.11,500, మినీ వర్కర్లు, హెల్పర్లకు రూ.7 వేలు, ఆశా వర్కర్లకు రూ.10 వేలు జీతం ఇస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం రూ.12 వేల వరకు ఆదాయం కలిగిన ఎస్సీ, ఎస్టీలు ఉచిత విద్యుత్ పథకానికి అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది కానీ అమలులో మాత్రం అన్యాయం చేస్తునందన్నారు. ఎస్సీ, ఎస్టీ అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో ఉచిత విద్యుత్ ఇవ్వకుండా విద్యుత్ బిల్లులు కట్టమని నోటీసులు ఇవ్వడం అన్యాయం అన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి ఎస్సీ, ఎస్టీ అల్పాదాయ వర్గాలకు ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అల్పాదాయ వర్గాలకు సంక్షేమ పథకాల్లో జరుగుతున్న అన్యాయాన్ని సరిచేసేందుకు ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు పేరం బాబురావు, కుంభ ఆంజనేయులు షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ నిబంధనలను విధిగా పాటించాలి

పట్టణ సీఐ వీరాస్వామి



మంగళగిరి టౌన్: వినాయక చవితిని పురస్కరించుకుని మంగళగిరి పట్టణంలో గణేష్ ఉత్సవ నిర్వాహకులు మండపాల వద్ద ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రిసిటీ నిబంధనలను విధిగా పాటించాలని మంగళగిరి పట్టణ సీఐ వీరాస్వామి సూచించారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండపాలు ఏర్పాటు చేసే వారు స్థల యజమానుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. నిర్దేశించిన సమయంలో గణేష్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవ మండపాల వద్ద మద్యం సేవించి ఎవరైనా హడావుడి చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. మండపాల వద్ద అల్లర్లకు దిగడం, స్థానికులకు అసౌకర్యం కల్గించడం, ట్రాఫిక్ సమస్యను సృష్టించడం వంటి చర్యలకు పాల్పడకూడదని హెచ్చరించారు. బాణసంచా పేలుళ్లు, డీజేలకు అనుమతి లేదన్నారు. పోలీసుల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పిల్లలకు మంచి చెడు స్పర్శలపై అవగాహన



పెదవడ్లపూడి(మంగళగిరి): పిల్లలకు మంచి, చెడు స్పర్శలపై చిన్నతనం నుంచే అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లితండ్రులపై ఉందని కేఎల్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ప్రొఫెసర్ బి.నాగమణి తెలిపారు. ఎంటీఎంసీ పరిధిలోని పెదవడ్లపూడి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం కేఎల్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ తల్లితండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలని, అప్పుడే బయటకు చెప్పుకోలేని విషయాలను పంచుకుంటారన్నారు. తద్వారా పిల్లల పట్ల లైంగికపరమైన ఇబ్బందులు ఉన్నాయో తల్లితండ్రులకు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇంట్లో లేదా బయట ఎవరైనా బాలికల పట్ల చెడు స్పర్శ చేసినట్లయితే వెంటనే తల్లితండ్రులకు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండడంతో పాటు ఫొటోలు ఎవరితోను పంచుకోకూడదన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లితండ్రులు గమనిస్తుండాలని, స్మార్ట్‌ఫోన్‌ను ఎలా వాడుతున్నారు, ఏమి చూస్తున్నారనే దానిపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ వి.మానిక, కో ఆర్డినేటర్ పి.సురేష్; వీసీ పి.పార్థసారథి వర్మ, ప్రొవీసీలు డాక్టర్లు ఏవీఎస్ ప్రసాద్, ఎన్ వెంకట్రామ్, రాజశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

శాలివాహన సంఘ అధ్యక్షుడిగా సాంబశివరావు



ఫిరంగిపురం: శాలివాహన సంఘ మండల అధ్యక్షుడిగా సెగ్గం సాంబశివరావును సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ సమావేశం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు సాంబశివరావును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎ.అంకారావు, కార్యదర్శిగా ఎం.ఏడుకొండలు, సభ్యులుగా మల్లెల ఏడుకొండలు, పి.హనుమంతురావు, ఎం.సుబ్బారావు, ఆర్.అప్పయ్య, జి.వెంకటేశ్వర్లు, సీహెచ్ కోటేశ్వరరావు, కె.రాములు, బి.శ్రీనివాస రావు, టి.శివశంకర్, టి.గౌతమ్‌సాయి, ఎస్.వెంకటేశ్వరరావు, ఆర్.శ్రీకాంత్, ఎన్.రమేష్‌లను ఎన్నుకున్నారు. అనంతరం పలువురు సంఘ సభ్యులు సాంబశివరావును అభినందించారు.

బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు



మంగళగిరి టౌన్: వివాదాస్పద ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించిన తనపై కొందరు బెదిరింపులకు దిగుతున్నారని, తప్పుడు కేసులు పెడతామని బెదిరిస్తున్నారని, అలాంటి ఉడత బెదిరింపులకు భయపడేది లేదని భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పరిధిలోని బీసీవై కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవుడి రూపంలో నటుల విగ్రహాలు ఏర్పాటు చేసే సంస్కృతి నశించాలని డిమాండ్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ విష సంస్కృతికి నాంది పలకాలన్నారు. గతంలో తెలుగు రాష్ట్రాల్లో శ్రీకృష్ణుడి రూపంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. త్వరలోనే కోర్టులను ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని, కారేడు ఉద్యమానికి బీసీవై అండగా ఉంటుందని, ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

క్రైస్తవులకు ప్రత్యేక చట్టం రూపొందించాలి



డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని చూపిస్తున్న క్రైస్తవులు

మంగళగిరి టౌన్: పాస్టర్లు, చర్చిలు, క్రైస్తవుల రక్షణకై ఎస్సీ, ఎస్టీ చట్టం మాదిరిగా ప్రత్యేక క్రైస్తవ అత్యాచార నిరోధక చట్టం రూపొందించాలని ప్రముఖ సామాజికవేత్త, క్రైస్తవ నాయకులు గోళ్లమూడి రాజా సుందరబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో సోమవారం రాష్ట్ర క్రైస్తవ ఐక్య కార్యాచరణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సుందరబాబు మాట్లాడుతూ క్రైస్తవ మిషనరీల ఏర్పాటు చేసిన క్రైస్తవ సమాధి తోటలన్నీ సమాధులతో నిండిపోయాయని, సమాధి తోటలకు స్థలాలు కేటాయించాలన్నారు. పాస్టర్లకు గౌరవ వేతనం రూ.5 వేలు సరిపోదని, పెంచాలని కోరారు. మే నెలలో కొంతమంది పాస్టర్లకు మాత్రమే గౌరవ వేతనం ఇచ్చారని అందరికీ వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. క్రైస్తవులకు రక్షణ చట్టం ఏర్పాటు చేసి, అమలు కోసం లీగల్ సెల్‌ను క్రైస్తవ న్యాయవాదులతో ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశం అనంతరం ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ అన్నవర్లపూడి శేఖర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో క్రైస్తవ ఐక్య కార్యాచరణ పోరాట కమిటీ నాయకులు డేవిడ్ రాజు, సుబ్బారావు, డాక్టర్ వరబాబు, శ్యాంబాబు, జాషువా, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పారావు

ఫిరంగిపురం: ఫిరంగిపురం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ నాయకుడు హోచ్‌మన్ అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉన్నా, నీరు మురికిగా వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అలాంటి నీటిని వాడటం వల్ల ప్రజలు చర్మ సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. చెరువుల్లో నీటిని శుభ్రం చేసి విడుదల చేయాలన్నారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అదేవిధంగా పొగాకు కొనుగోలు చేసిన వారు రైతులకు నగదు చెల్లించాలని తెలిపారు. పొగాకు కొనుగోలులో ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా కొనుగోళ్లు చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, జి.వెంకటేశ్వర రావు, అంకమ్మరావు, ఎం.వెంగళరెడ్డి పాల్గొన్నారు.

‘శ్రేష్ట’ ద్వారా స్థానికంగా ప్రవేశాలు కల్పించాలి



మాదిగ కార్పొరేషన్ చైర్మన్ శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న అరుంధతి ఫౌండేషన్ సభ్యులు

మంగళగిరి టౌన్ : స్కీమ్ ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హైస్కూల్స్ ఇన్ టార్గెటెడ్ ఏరియాస్ (ఎన్‌టీఏ శ్రేష్ట) ద్వారా ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. అరుంధతి ఫౌండేషన్ తిరుపతి ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిలోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. అరుంధతి ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన జీవోలకు వ్యతిరేకంగా కోర్టులకు వెళ్లే ఆర్థిక స్థోమత లేదని, కోర్టుకు వెళ్లిన వారికే సీట్లు కేటాయిస్తామంటే ప్రతిభ కలిగిన బిడ్డలు ఉన్నత చదువులకు దూరమవుతారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రేష్ట ద్వారా ఎంపికైన విద్యార్థులను స్థానికత అంశం నుంచి మినహాయింపునిస్తూ రాష్ట్ర విద్యా సంస్థల్లో ప్రవేశం కల్పించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అరుంధతి ఫౌండేషన్ సభ్యులు పాటిబండ్ల సుధాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీలు పార్టీ పటిష్టతే లక్ష్యంగా పని చేయాలి

వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు



డైమండ్ బాబును సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

తాడికొండ: నూతనంగా ఎన్నికైన కమిటీలు పార్టీ పటిష్టతే లక్ష్యంగా కష్టపడి పనిచేయాలని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) అన్నారు. సోమవారం ఫిరంగిపురం మండలంలో నూతనంగా ఎన్నికైన అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి నాయకులు, కార్యకర్తలే పునాదులని, గ్రామ స్థాయిలో సమావేశాల అనంతరం అందరి ఆమోదంతో ఎన్నికైన గ్రామ పార్టీ అధ్యక్షులు అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు అందరినీ కలుపుకొని పనిచేయాలని సూచించారు. గతంలో చిన్నపాటి విభేదాలను పక్కన పెట్టి ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి గతంలో కంటే ఆదరణ పెరిగిందనేందుకు గ్రామాల్లో వస్తున్న ఆదరణే నిదర్శనమని, మరింత కష్టపడి పనిచేస్తే 2029 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని ఓడించి తీరడం ఖాయమన్నారు. ఫిరంగిపురం మండలంలో ఇప్పటికే 85 శాతం పదవుల ఎంపిక పూర్తయిందని, మిగిలిన పదవులు కూడా త్వరలో పూర్తిచేసి కష్టపడి పనిచేసే ప్రతి నాయకుడికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలన కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సంక్షేమం, అభివృద్ధి జాడ లేదని, వాటన్నింటిని ఎత్తిచూపి సామాన్యుడికి న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇన్‌చార్జి డైమండ్ బాబును పలువురు నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పలువురు ముఖ్య నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రవికుమార్

పొన్నెకల్లు(తాడికొండ)/యర్రబాలెం(మంగళగిరి): వినాయక చవితి వేడుకలు సామరస్యంగా జరిగేందుకు గ్రామస్తులు సహకరించాలని గుంటూరు జిల్లా లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ ఎ.రవికుమార్ సూచించారు. తాడికొండ మండలం పొన్నెకల్లు, మోతడక గ్రామాల్లో, అలాగే మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో సోమవారం పర్యటించిన ఆయన సమావేశాలు నిర్వహించి గ్రామస్తులకు పలు సూచనలు జారీ చేశారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన సమావేశం నిర్వహించారు. వేడుకలను అడ్డుపెట్టుకొని నిబంధనలు అతిక్రమించి విచ్చలవిడి డ్యాన్సులు, పార్టీలకు సంబంధించిన పాటలు, జెండాలు ఏర్పాటు చేయడం వంటివి జరగకుండా ఉండేలా విగ్రహ కమిటీ బాధ్యత వహించాలన్నారు. ఏదైనా వివాదాలు, ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గతంలో పొన్నెకల్లు గ్రామంలో వివాదం నెలకొనడంతో పాటు ఎస్‌పై దాడికి పాల్పడిన నేపథ్యంలో 120 మందిపై బైండోవర్ ఉన్నందున చిన్నపాటి ఘటన జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. ఇరువర్గాలు సంయమనం పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. పందిళ్ల వద్ద, నిమజ్జనం రోజు యువకులు మద్యం తాగి అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంతంగా గ్రామోత్సవం, నిమజ్జనం జరిగేలా చూడాల్సిన బాధ్యత కమిటీలదేనని తెలిపారు. ఆయన వెంట నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు వై.శ్రీనివాస రావు, కె.వాసు ఎస్‌ఐలు వెంకట్, వెంకటరావు, లోకేష్, సిబ్బంది ఉన్నారు.